సాక్షి
కామారెడ్డి
గురువారం । 26 । డిసెంబర్ । 2024



'సబ్‌స్టేషన్' పూర్తయ్యేదెప్పుడో?
మహ్మద్‌నగర్ మండలకేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ఏడాది గడిచినా పునాదుల దశ దాటడం లేదు.
- 9లో ▸



బోధనకు బ్రేకులు
కేజీబీవీలలో పనిచేస్తున్న టీచర్లు సమ్మె చేస్తుండడంతో పాఠాలు ముందుకు సాగక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.8 /18.4
వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'ప్రభుత్వ టీచర్లను కేజీబీవీలకు పంపించొద్దు'

బాన్సువాడ : కేజీబీవీ, మోడల్ స్కూళ్లకు డిప్యుటేషన్‌పై ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను పంపించాలన్న నిర్ణయాన్ని సర్కారు వెనక్కి తీసుకోవాని తపస్ డిమాండ్ చేసింది. కేజీబీవీ, మాడల్ స్కూల్ కాంట్రాక్టు ఉపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు బోధించేందుకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని తపస్ ఖండించింది. సమ్మె చేస్తున్న వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవరెడ్డి, సంతోష్ ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

చిరుత ఆనవాళ్ల కోసం గాలింపు

నందిపేట్: కొండూర్ శివారులో మంగళవారం సాయంత్రం మేకల మందపై చిరుత దాడి చేసిన విషయం తెలిసిందే. రేంజ్ అటవీశాఖ అధికారి సుధాకర్, స్థానిక ఎస్సై చిరంజీవి బుధవారం గొర్రెల కాపరి పోతన్నను విచారించి చిరుత ఆనవాళ్ల కోసం గాలింపు చేపట్టారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు అటవీప్రాంతంలోనే ఉన్నారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారి సుధాకర్ మాట్లాడుతూ గొర్రెపై దాడి చేసింది చిరుతో కాదో కచ్చితంగా చెప్పలేమన్నారు. అటవీప్రాంతానికి పంటపొలాలకు మధ్య కొన్ని దారుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అటవీప్రాంతానికి దగ్గర ఉన్న పంటపొలాలకు వెళ్లేవారు ఒంటరిగా వెళ్లొద్దని సూచించారు. చిరుత సంచరిస్తోందనే కారణంతో కొంత మంది రైతులు పంటపొలాల చుట్టూ విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తున్నారని, ఈ చర్య చట్ట వ్యతిరేకమని పేర్కొన్నారు.

మొరాయించిన ఎలక్ట్రిక్ బస్సు

ఖలీల్‌వాడి : ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సు మొదటి ట్రిప్పులోనే మొరాయించింది. బుధవారం సాయంత్రం నిజామాబాద్ నుంచి బాన్సువాడ వెళ్తున్న బస్సు మార్గమధ్యలో నాగారం వద్ద నిలిచిపోయింది. డిపో మెకానిక్‌లు వచ్చి మరమ్మతులు చేశారు. అరగంట తర్వాత బస్సు బయలుదేరడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఎలక్ట్రిక్ బస్సులను రెండు రోజుల క్రితం కరీంనగర్ ఈడీ ప్రారంభించిన విషయం తెలిసిందే.

సహకారం.. దూరం!

- కొన్ని మండలాల్లో ఒకటే సొసైటీ
- పరిధి ఎక్కువై అందని సేవలు
- కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలంటున్న రైతులు

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పరిధి ఎక్కువగా ఉన్న చోట అన్నదాతలకు సరైన సేవలు అందడం లేదు. కొన్ని మండలాల్లో రెండు మూడు గ్రామాలకు ఒక సొసైటీ ఉండగా.. మరికొన్ని చోట్ల మండలానికి ఒకటే సంఘం ఉంది. దీంతో రైతులు సొసైటీల నుంచి ఎరువుల బస్తాలు తీసుకువెళ్లడానికిగానీ, పంట రుణాలు తీసుకునేందుకు గానీ ఇబ్బందులు పడుతున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో 26 మండలాల పరిధిలో ప్రస్తుతం 55 సహకార సంఘాలు ఉన్నాయి. సుమారు 2 లక్షల మంది రైతులు, అదే స్థాయిలో రైతు కూలీలు ఉన్నారు. సహకార సంఘాల్లో లక్షన్నర మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. అయితే సహకార సంఘాల సేవలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంఘాలు రైతులకు అందుబాటులో ఉంటే వాటి సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడానికి అవకాశాలుంటాయి. దూరాన ఉండడంతో వెళ్లిరావడం రైతులకు ఇబ్బందికరంగా ఉంటోంది. సొసైటీల ఏర్పాటు విషయంలో చాలా డిమాండ్‌లు ఉన్నాయి. ఏయే ప్రాంతాల్లో సంఘాల ఏర్పాటు ఆవశ్యకత ఉందన్న దానిపై శాస్త్రీయంగా సర్వే నిర్వహించి ఏర్పాటుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



ఆ మండలాల్లో ఒక్కటీ లేదు..

కొన్ని మండలాలలో రెండుమూడు సహకార సంఘాలుండగా.. మాచారెడ్డి, కామారెడ్డి మండలాల్లో ఒక్కో సహకార సంఘం ఉన్నాయి. రామారెడ్డి, పాల్వంచ మండలాలలో ఒక్క సొసైటీ కూడా లేకపోవడం గమనార్హం. మాచారెడ్డి, పాల్వంచ మండలాలకు కలిపి ఒకే సహకార సంఘం మాచారెడ్డిలో ఉంది. గతంలో మాచారెడ్డి మండల పరిధిలో ఉండి, మండలాల పునర్విభజన తర్వాత రామారెడ్డి మండలంలోకి వెళ్లిన మద్దికుంట, రెడ్డిపేట, అన్నారం గ్రామాలు కూడా మాచారెడ్డి సహకార సంఘం పరిధిలో ఉన్నాయి. నలభైకిపైగా గ్రామాలకు ఒకే సహకార సంఘం ఉండడంతో సరైన సేవలు అందడం లేదు.

కొత్త సొసైటీలు ఏర్పాటయ్యేనా?

గతంలో ఎల్పుగొండ సొసైటీ ఉండేది. కానీ నష్టాల పేరుతో దానిని మాచారెడ్డి సొసైటీలో విలీనం చేశారు. ఎల్పుగొండ సొసైటీని పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు. అలాగే భవానీపేట, ఆరెపల్లి, భవానీపేట తండా, సింగరాయపల్లి గ్రామాలకు ఒక సొసైటీ ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత రైతులు డిమాండ్ చేస్తున్నారు. మాచారెడ్డి మండలంలో సోమారంపేట, ఎల్లంపేట, బంజెపల్లి, రత్నగిరిపల్లితో పాటు మరికొన్ని గ్రామాలు, తండాలను కలిపి ఇంకో సొసైటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

- రామారెడ్డి మండలంలో రెడ్డిపేట, మద్దికుంట, అన్నారం తదితర గ్రామాలతో సంఘాన్ని ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది.
- కామారెడ్డి పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలకు కలిపి ఒకే సహకార సంఘం ఉంది. గతంలో చిన్నమల్లారెడ్డి, గర్గుల్ సొసైటీలు ఉండేవి. వాటిని పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది.
- పిట్లం మండలంలో తిమ్మానగర్, కారేగాం, చిల్లర్గి సొసైటీలున్నాయి. అయితే మండల కేంద్రంలో సొసైటీ లేదు. ఇటీవల జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పిట్లంలో సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.
- బిచ్కుంద మండలంలో బిచ్కుంద, పుల్కల్ రెండు సొసైటీలు ఉన్నాయి. ఇక్కడ కూడా మరో సొసైటీ అవసరం ఉంది.
- జుక్కల్, మద్నూర్ మండలాల్లోనూ ఒక్కొక్కటి చొప్పున మాత్రమే సొసైటీలున్నాయి. ఆయా మండలాల్లోనూ కొత్త సొసైటీలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా సహకార రంగాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించిన నేపథ్యంలో జిల్లాలో ఎక్కడెక్కడ సొసైటీలు ఏర్పాటు చేయడానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయో అధికారులు నివేదికను రూపొందించి ప్రభుత్వం ముందుంచాలంటున్నారు. సహకార శాఖ అధికారులతోపాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఘనంగా క్రిస్మస్



జిల్లా కేంద్రంలోని వెస్లీ చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

కామారెడ్డి టౌన్: జిల్లాలో క్రైస్తవులు బుధవారం క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకున్నారు. చర్చీలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా కేంద్రంలోని సీఎస్‌ఐ వెస్లీ చర్చిలో పెద్ద ఎత్తున వేడుకలను నిర్వహించారు. జిల్లాలోని ఆయా చర్చీలలో క్రైస్తవ మత బోధకులు ప్రార్థనలు చేయించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ప్రేమను బోధించిన శాంతిదూత ఏసు

బాన్సువాడ : సమాజానికి శాంతి, ప్రేమ ప్రబోధించిన శాంతిదూత ఏసు అని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బాన్సువాడ సీఎస్‌ఐ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో ఆయన ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో భాగంగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాసుల బాల్‌రాజ్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ జ్ఞానేశ్వర్, క్రైస్తవులు తార, జోసఫ్, రీగన్, విజయ్‌కుమార్, సూర్య జేమ్స్, స్టీఫెన్, దైవసాయం, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడలో కేక్ కట్ చేస్తున్న పోచారం

'హనుమాన్ చాలీసా పారాయణం చేయాలి'

ఎల్లారెడ్డి రూరల్: ప్రతి గ్రామంలో హనుమాన్ చాలీసా పారాయణం చేయాలని తెలంగాణ ప్రాంత గోరక్ష ప్రముఖ్ వెంకటేశం సూచించారు. బుధవారం ఎల్లారెడ్డిలో విశ్వహిందూ పరిషత్ శిక్షణ వర్గ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గ్రామాలలో వీహెచ్‌పీ కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి తమ్మల కృష్ణ, జిల్లా అధ్యక్షుడు నిత్యానందం, విశేష సంపర్క ప్రముఖ్ గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడు గంగారెడ్డి, జిల్లా కార్యదర్శి బొల్లి రాజు, కోశాధికారి డిష్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశం

అత్యాచారం.. మహిళ మృతి

రెంజల్(బోధన్): మహిళపై సామూహిక అత్యాచారం జరపడంతో పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న గల్లీవాసులు పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పినా కేసులకు భయపడి కుటుంబీకులు ఆదరబాదరగా అంత్యక్రియలు పూర్తి చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన సుమారు 40 ఏళ్ల మహిళకు వదినె వరుసయ్యే ఆడపడుచు (భర్త చెల్లెలు) ఉంది. ఆడపడుచు నిజామాబాద్‌లోని అద్దె గదిలో కొంత కాలంగా వ్యభిచార గృహం నిర్వహిస్తోంది. ఇంటికి విటులను పిలిపించుకుని మరదలిని నిజామాబాద్‌కు రప్పించుకునేది. కొంత కాలంగా గుట్టుగా ఈ వ్యవహారం సాగుతోందని తెలిసింది. అయితే బాధిత మహిళ భర్త అనారోగ్యంతో రెండు నెలల క్రితం గ్రామంలో మృతి చెందాడు. మృతుడి చెల్లెలైన వ్యభిచార గృహం నిర్వాహకురాలు అంత్యక్రియలకు వచ్చి దిశ, దిన కర్మలు పూర్తయ్యే వరకు ఇక్కడే ఉండి వెళ్లింది. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం మరదలిని తిరిగి నిజామాబాద్‌కు పిలిపించుకుంది. అక్కడ సామూహిక అత్యాచారం జరగడంతో పరిస్థితి విషమించి మరుసటి రోజు శనివారం బాధిత మహిళ ఇంట్లోనే మృతి చెందినట్లు తెలుస్తోంది. వ్యభిచార గృహం నిర్వాహకురాలు మరదలి మృత దేహాన్ని అదే రోజు ఆటోలో గ్రామానికి తీసుకొచ్చింది. అప్పటికే గల్లీలో విషయం పొక్కడం, మృతదేహంపై గాయాలు కనిపించడంతో గల్లీవాసులు అనుమానించారు. విషయాన్ని పోలీసులకు చెప్పాలని సూచించినా కుటుంబీకులు అప్పటికప్పుడు మృతదేహానికి దహన సంస్కారాలు నిర్వహించారు. మృతురాలికి కొడుకు, ఎనిమిదేళ్ల కూతురు ఉన్నారు. కొడుకును మూడు నెలల క్రితం అప్పులు చేసి దుబాయ్ పంపించారు. దుబాయ్ వెళ్లిన నెలరోజులకే తండ్రి అనారోగ్యంతో మరణించాడు. ఇప్పుడు తల్లి మరణించడంతో తిరిగి గ్రామానికి వచ్చేశాడు. చేసిన అప్పులు తీరకుండానే కుటుంబంలో విషాదం నెలకొంది.

సడక్‌పై చదువులతో నిరసన

- కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

కామారెడ్డి టౌన్: తమ డిమాండ్‌ల పరిష్కారం కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 16వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా 'సడక్‌పై చదువులు' అనే కార్యక్రమంతో నిరసన తెలిపారు. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరం ముందు రోడ్డుపై ఉద్యోగులు, విద్యార్థులు, చిన్నారులు బైటాయించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు పిల్లలకు పాఠాలు చెబుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారి సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ బడిలో ఉండాల్సిన ఉపాధ్యాయులు రోడ్డుపైకి వచ్చి పోరాటం చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేయాలని, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు పే స్కేల్ అమలు చేయాలని కోరారు. సమ్మెలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షురాలు వాసంతి, నాయకులు శ్రీధర్, రాములు, సంతోష్‌రెడ్డి, శైలజ, వనజ, రమేశ్, కాళిదాసు, సాయిలు, వీణ, లావణ్య, శ్రీను, శ్రీవాణి, రాణి, దినేశ్, లింగం, కృష్ణ ఉద్యోగులు పాల్గొన్నారు.



సమ్మెలో కూర్చున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు, ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కలకలం రేపిన ఆత్మహత్యలు

- కానిస్టేబుల్ శృతి, యువకుడు నిఖిల్ మృత దేహాలు లభ్యం
- చెరువు వద్ద భిక్కనూరు ఎస్సై సాయికుమార్ కారు లభ్యం
- వారితోనే ఉన్నట్లు భావిస్తున్న పోలీసు అధికారులు
- చెరువులో కొనసాగుతున్న గాలింపు





ఎస్సై సాయికుమార్ కానిస్టేబుల్ శృతి నిఖిల్



అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో గాలిస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి / కామారెడ్డి క్రైం : భిక్కనూరులో పనిచేస్తున్న ఎస్సై సాయికుమార్, బీబీపేటలో పనిచేస్తున్న కానిస్టేబుల్ శృతితో పాటు బీబీపేటకు చెందిన యువకుడు నిఖిల్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కామారెడ్డి జిల్లాలో కలకలం రేపింది. చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు సమీపంలో ఎస్సై కారు లభ్యం కావడం, చెరువు వద్ద చెప్పులు ఉండడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసు అధికారులు భావించారు. బుధవారం సాయంత్రం నుంచి శవాల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది చెరువులో వెదికారు. అర్ధరాత్రి 12.30 గంటలకు కానిస్టేబుల్ శృతి, యువకుడు నిఖిల్ శవాలు దొరికాయి. ఎస్సై, మహిళా కానిస్టేబుల్‌తో పాటు యువకుడు కలిసి చెరువు వద్దకు చేరుకున్నారా ? వారి మధ్యన ఉన్న గొడవలేంటి ? ఎందుకు ఆత్మహత్య చేసుకుని ఉంటారు ? అన్నది ఎవరికీ అంతుబట్టడం లేదు. ఎస్సై సాయికుమార్ గతంలో బీబీపేట పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహించారు. అక్కడ కానిస్టేబుల్‌గా శృతి పనిచేసేది. ఇప్పుడు కూడా అక్కడే విధులు నిర్వహిస్తోంది. బీబీపేటకు చెందిన నిఖిల్ సొసైటీలో ఆపరేటర్‌గా పనిచేస్తూనే, కంప్యూటర్లు మరమ్మతులు చేస్తుంటాడని తెలుస్తోంది. పోలీసు స్టేషన్‌లోని కంప్యూటర్లకు ఏదైనా సమస్య వస్తే నిఖిల్ వచ్చి సరి చేసి వెళతాడని చెబుతున్నారు. అయితే ఈ ముగ్గురి మధ్యన ఉన్న గొడవలేంటి అన్నది బయటకు వెళ్లడి కావడం లేదు. శవాలు దొరికిన తరువాత పోలీసు అధికారులు ఏమైనా వివరాలు వెల్లడిస్తేగానీ స్పష్టత వచ్చే అవకాశం కనిపించడం లేదు.

సమస్యలు సీఎం దృష్టికి తీసుకు వెళ్తాం

నిజామాబాద్ అర్బన్: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె శిబిరాన్ని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడి న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారం కోసం ముఖ్యమంత్రితో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు ఎమ్మెల్యేతో సమస్యలు చెబుతూ కంటతడి పెట్టారు. ఎమ్మెల్యే వారిని ఓదారుస్తూ అధైర్యపడొద్దని మీ వెనకాల నేనున్నానని అన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి భూపేందర్, కోశాధికారి ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, మహిళా అధ్యక్షురాలు గంగామణి, నాయకులు రాజు, రాణి, సుప్రజ, అఫ్సర్, గిరీశ్, రమేశ్, శ్రీనివాస్, నగేశ్‌గౌడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షాశిబిరంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

కులాంతర వివాహాలకు 'ప్రోత్సాహం' కరువు

కామారెడ్డి మండలానికి చెందిన ఓ జంట కులాంతర వివాహం చేసుకుంది. వారికి ఇద్దరు సంతానం కూడా కలిగారు. కానీ ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం అందలేదు. అధికారుల చుట్టూ తిరిగి విసిగి వేసారి పోయారు.

మాచారెడ్డి మండలానికి చెందిన ఓ జంటకు వివాహమై మూడేళ్లు గడిచాయి. కులాంతర వివాహానికి సంబంధించిన ప్రోత్సాహక మొత్తం కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారికి ఒక కుమారుడు జన్మించినా.. ఇప్పటికీ నిధులు మంజూరు కాలేదు.



- నాలుగేళ్లుగా మంజూరు కాని నిధులు
- సాయం కోసం తప్పని ఎదురుచూపులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రభుత్వం అందించే ప్రోత్సాహానికి నిధుల గ్రహణం పట్టుకుంది. నాలుగేళ్లుగా నిధులు విడుదల కాకపోవడంతో చాలామంది నిరుత్సాహానికి గురవుతున్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన అమ్మాయి లేదా అబ్బాయిని ఇతర వర్గాలకు చెందిన వారు పెళ్లి చేసుకుంటే వారికి ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా రూ. 2.50 లక్షలు మంజూరు చేస్తారు. అయితే ఈ డబ్బులను కులాంతర వివాహం చేసుకున్న జంట పేరుతో జాయింట్ అకౌంట్ తెరిచి మూడేళ్ల కాలపరిమితితో కూడిన డిపాజిట్ చేస్తారు. కానీ నాలుగేళ్లుగా నిధులే మంజూరు కావడం లేదు. దీంతో దరఖాస్తుదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. సర్కారు స్పందించి, నిధులు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

దరఖాస్తుల వివరాలు..

సంవత్సరం	దరఖాస్తులు	మంజూరైనవి	పెండింగ్‌లో..
2021-22	49	40	09
2022-23	32	0	32
2023-24	33	0	33
2024-25	13	0	13

ఆదర్శ నాయకుడు వాజ్‌పేయి



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

కామారెడ్డి టౌన్: మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి ఆదర్శ నాయకుడని బీజేపీ నేతలు పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వాజ్‌పేయి శత జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్ జైన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వాజ్‌పేయిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నీలం చిన్నరాజులు, రంజిత్ మోహన్, రాంరెడ్డి, నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, లక్ష్మారెడ్డి, భరత్, విఠల్, బాల్‌రాజు, సంతోష్, వేణు, రవీందర్, శ్రీనివాస్, ప్రతాప్, శ్రీకాంత్, గోవర్ధన్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తైక్వాండో టోర్నీ లోగో ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని గంగస్థాన్‌లో ఈ నెల 29న నిర్వహించే తైక్వాండో టోర్నమెంట్ లోగోను రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. తైక్వాండో కోచ్ వినోద్‌నాయక్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమానికి ముందు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, రూరల్ ఎస్సై ఎండీ ఆరిఫ్ చేతుల మీదుగా లోగోను కోచ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోచ్‌లు, క్రీడాకారులు, నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమ పథకాలు అమలు చేయాలి



సుజాత సూర్యవంశీ

బోధన్: దివ్యాంగుల సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ బుధవారం డిమాండ్ చేశారు. దివ్యాంగులకు పెంచుతామన్న పింఛన్ ఇప్పటి వరకు చెల్లించలేదని, వారం రోజుల్లో చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నూతన పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరు చేయాలన్నారు. అర్హులైన దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని పేర్కొన్నారు.

ఆదివాసీలు అన్ని రంగాల్లో రాణించాలి



పెర్కిట్: ఆదివాసీలు అన్ని రంగాల్లో రాణించాలని ఆదివాసి నాయక్‌పోడ్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాంచందర్ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ భీమన్న మందిరం ప్రాంగణంలో బుధవారం ఆదివాసి నాయక్‌పోడ్ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి రాంచందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదివాసి పిల్లలు ఉన్నత చదువుల కోసం అంబేడ్కర్ ఓవర్సీస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలన్నారు. జాతి సంస్కృతి, సాంప్రదాయాలను పాటిస్తూ ఐక్యంగా ఉండి రాజకీయంగా అభివృద్ధి చెందాలన్నారు. సమావేశంలో ఆదివాసి నాయక్‌పోడ్ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట రాజేశ్వర్, కొసెడుగు రవి కుమార్, శానం పవన్ కుమార్, కొద్రు నవీన్, ఐ రాజు, డి అంజయ్య, ఎం అశోక్, పూల నర్సయ్య, డి నరేందర్, టీసీ విఠల్, జి గంగాధర్, జి శ్రీనివాస్, ఎం ప్రవీణ్, ఎం సుదర్శన్, డి శ్రీనివాస్, ఎం సాగర్ పాల్గొన్నారు.

చర్చిలకు కేక్‌ల పంపిణీ



నవీపేట: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే షకీల్ సౌజన్యంతో బీఆర్ఎస్ నాయకులు బుధవారం మండలంలోని 31 గ్రామాల్లోని చర్చిలకు బుధవారం కేకులను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ఇండియన్ పెంతెకోస్త్ చర్చిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ గ్రామాల చర్చి పాదర్‌లకు కేకులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు నర్సింగ్‌రావు, ప్రవీణ్‌కుమార్, లోకం నర్సయ్య, సూరిబాబు, గైని సతీశ్, చర్చి ఫాదర్లు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాల్లో బోధనకు బ్రేకులు

- కొన్నిరోజులుగా సమ్మెలోనే ఎస్‌వోలు, టీచర్లు
- దగ్గరపడుతున్న ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు
- పాఠాలు చెప్పేవారు లేక ఆందోళనలో విద్యార్థులు



పాఠాలు బోధించే టీచర్లు లేక పుస్తకాలతో కుస్తీ పడుతున్న విద్యార్థినులు

నిజాంసాగర్: జిల్లావ్యాప్తంగా ఉన్న కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో బోధనకు బ్రేకులు పడ్డాయి. ఉద్యోగ భద్రత, పే స్కేల్ అమలు తదితర డిమాండ్ల సాధన కోసం ఆయా పాఠశాలల్లోని సమగ్రశిక్ష పథకం కింద పనిచేస్తున్న ప్రత్యేకాధికారులు, ఉపాధ్యాయ బృందం సమ్మెబాట పట్టడంతో విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు కరువయ్యారు. కస్తూర్బా పాఠశాలల్లో పదో తరగతి, ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు వార్షిక పరీక్షలకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో సిలబస్ పూర్తి కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

ప్రశ్నార్థకంగా 5,500 మంది భవితవ్యం

జిల్లాలో 19 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు ఉండగా ఆరవ తరగతి నుంచి 5,500 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. అందులో ఎస్సెస్సీలో 783 మంది విద్యార్థినులు, ఇంటర్మీడియట్‌లో 1,185 మంది విద్యార్థినులు ఉన్నారు. కస్తూర్బా టీచర్లు నిరవధిక సమ్మె చేస్తుండటంతో ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు విద్యాబోధన చేసేవారు కరువయ్యారు. అంతేకాకుండా ఆరు నుంచి 9వ తరగతులకు సైతం టీచర్లు లేక విద్యార్థినులు తరగతి గదుల్లో కాలక్షేపం చేస్తున్నారు. మార్చి నెలలో ఇంటర్మీడియట్‌తో పాటు ఎస్సెస్సీ వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఎస్సెస్సీకి డిసెంబర్ నెలాఖరులోగా అన్ని సబ్జెక్టుల బోధన సిలబస్ పూర్తి కావాల్సి ఉంది. అంతేకాకుండా జనవరిలో రివిజన్ ప్రారంభం కావాల్సి ఉండగా సిలబస్ పూర్తికాక విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు.

సమ్మెకు ప్రభుత్వం స్పందించకపోతే

సిబ్బంది సమ్మెతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ సమ్మెకు ప్రభుత్వం స్పందించకపోతే బోధనేతర సిబ్బందిని కూడా సమ్మెలోకి దింపుతామని సమగ్ర శిక్ష ఉద్యోగులు హెచ్చరిస్తున్నారు. బోధనేతర సిబ్బంది సమ్మెలో పాల్గొంటే కస్తూర్బా పాఠశాలలకు ఇక తాళం వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగులతో చర్చలు నిర్వహించి వారితో సమ్మె విరమింప చేయాలని పలువురు సూచిస్తున్నారు. లేకపోతే మార్కుల పరంగా చాలా నష్టపోవాల్సి వస్తుందన్నారు.

ఇప్పటికీ సిలబస్ పూర్తికాలేదు



నెలాఖరు వరకు అన్ని సబ్జెక్టుల వారీగా సిలబస్ పూర్తి కావాలి. ఇప్పటి వరకు అన్ని సబ్జెక్టుల్లో రెండు, మూడు పాఠ్యాంశాల సిలబస్ పూర్తి కాలేదు. 15 రోజుల నుంచి టీచర్లు లేక తరగతులు నడుస్తలేవు. టీచర్ల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలి.

– సింధు, ఎస్సెస్సీ విద్యార్థిని, నిజాంసాగర్ కస్తూర్బా

సమస్య త్వరగా పరిష్కరించాలి



పదోతరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలంటే మాకు టీచర్లు కావాలి. వారి సమస్య త్వరగా పరిష్కరించాలి. టీచర్లు సమ్మె చేస్తుండటంతో మా బతుకులు ఆగమం అవుతున్నాయి. పరీక్షల షెడ్యూల్ వెలువడింది. టీచర్లు లేకపోతే పరీక్షలకు ఎలా సిద్ధం అవ్వాలి.

– బిందు, ఎస్సెస్సీ విద్యార్థిని, నిజాంసాగర్ కస్తూర్బా

ఆలయాల భూములు పదిలమేనా?

- రూ.కోట్ల విలువచేసే భూములు అన్యాక్రాంతం
- సర్వేలతో సరిపెడుతున్న అధికారులు



న్యాల్‌కల్ వద్ద బడారాం మందిరం ఆలయ భూములను సర్వే చేస్తున్న అధికారులు(ఫైల్)

నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రముఖ ఆలయాలు బడా రాంమందిర్, సారంగాపూర్ హనుమాన్ ఆలయం, నీలకంఠేశ్వరాలయం, జెండాబాలాజీ, ఖిల్లా రామాలయ (రఘునాథ ఆలయం) భూములు పదిలంగా ఉన్నాయా? లేక అన్యాక్రాంతమవుతున్నాయా? అనే దానిపై స్పష్టత లేకుండాపోతోందని ప్రజలు అంటున్నారు. నగరంలోని ప్రముఖ ఆలయాలకు అసలు భూములు ఎంత మేర ఉన్నాయి, పట్టాపాస్ పుస్తకాలు ఎవరి పేరుపై ఉన్నాయని ప్రశ్నిస్తుండగా, దేవాదాయశాఖకు సైతం పక్కా లెక్కలు తెలియడం లేదు. దేవుని మాన్యం భూములు ఇతరులు కబ్జా చేయకుండా అధికారులు చర్యలు ఎలా తీసుకుంటున్నరనేది ఎవరికీ తెలియని విషయంగా మిగిలిపోయింది. అలాగే భూములను కౌలు చేస్తున్న రైతులు ఆలయాలకు కౌలును సరిగా ఇస్తున్నారా? లేదా అనేది గోప్యంగా ఉండిపోతోంది. అలాగే గుట్టు చప్పుడు కాకుండా ఆలయాల భూములు బడా నాయకుల పేర్లపై అవుతున్నతున్నట్లు సమాచారం.

ఒక్క రోజు సర్వేతో సరి..

నగరంలోని బడారాం మందిరం భూములు న్యాల్‌కల్ రోడ్ ఆర్టీసీ బస్ డిపో వెనుక ప్రాంతంలో ఉండగా తూతూమంత్రంగా సర్వే చేసి చేతులు దులుపుకుంటున్నారు.

ఆలయ భూములను సర్వే చేసేందుకు కేవలం ఒక్కరోజే కేటాయించడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన అధికారులే ఒక్క రోజు సర్వే నిర్వహించడం అనుమానాలకు తావిస్తోంది.

బాధ్యత ప్రభుత్వానిదే..

జిల్లాలో ముఖ్యంగా బాడా రాం మందిర్ ఆలయ భూముల సర్వే గత నాలుగు రోజుల క్రితం ఒక రోజు చేపట్టారు. మళ్లీ అధికారులు వస్తామని రాలేదు. మొత్తానికి నగరంలోని ప్రధాన ఆలయ భూములు ఇప్పటికీ సురక్షితంగా ఉన్నాయి. సమస్యలు తలెత్తిన చోట సర్వేకు అనుమతులు తీసుకుంటున్నాం. దీనిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. – శ్రీరాం రవీందర్, జిల్లా ఇన్‌చార్జి కమిషనర్, దేవాదాయశాఖ

జాతీయ స్థాయి ఫిస్ట్‌బాల్‌కు ఎంపిక



జాతీయ స్థాయి ఫిస్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన పడకల్ విద్యార్థులు

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి ఫిస్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. జాతీయ సబ్ జూనియర్ ఫిస్ట్‌బాల్ పోటీలకు యాటకర్ల శివరామకృష్ణ, బదావత్ విష్ణువర్ధన్, విస్లావత్ కల్యాణి, ఈర్ల జగదీశ్వరి, సీనియర్ విభాగంలో బోండ్ల సలోని, బోండ్ల తేజ ఎంపికయ్యారు. బోయిన్‌పల్లిలోని కంటోన్మెంట్ గ్రౌండ్‌లో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు తమిళనాడులోని దిండిగల్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ తెలిపారు. జాతీయ జట్టులో 12 మంది క్రీడాకారులకు గాను ఆరుగురు క్రీడాకారులు పడకల్ నుంచే ఎంపిక కావడం విశేషం. జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులను రాష్ట్ర ఫిస్ట్‌బాల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు జగన్‌మోహన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకట్, హెచ్‌ఎం సురేందర్‌రెడ్డి, జీపీ కార్యదర్శి భరత్‌కుమార్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పుప్పాల శ్రీనివాస్, ధను, సుచిత్, ఎల్లుల్ల ప్రసాద్, గణేశ్ అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు..

మాక్లూర్: మండలంలోని గుత్ప ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఎం ఐశ్వర్య సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ కవిత బుధవారం తెలిపారు. ఈ నెల 27న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలత్లో విద్యార్థిని ఐశ్వర్య పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. అలాగే పరుగుపందెం, అథ్లెటిక్స్ పోటీల్లో కూడా గుత్ప పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని అన్నారు.

సీఎం కప్ వాలీబాల్ పోటీల అబ్జర్వర్‌గా మల్లేశ్‌గౌడ్



నిజామాబాద్‌నాగారం: సీఎం కప్ రాష్ట్ర వాలీబాల్ పోటీలకు అబ్జర్వర్‌గా జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా బొజ్జ మల్లేశ్‌గౌడ్ వ్యవహరించనున్నారు. ఈ మేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ నుంచి ఉత్తర్వులు విడుదలైనట్లు వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ హనుమంత్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు ఖమ్మం జిల్లా స్టేడియంలో జరగనున్న సీఎం కప్ రాష్ట్ర అండర్–18 వాలీబాల్ పోటీలకు పరిశీలకులుగా వెళ్లనున్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



సిరికొండ: జాతీయ స్థాయి హాకీ పోటీలకు తూంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ నాగేశ్ బుధవారం తెలిపారు. హుజురాబాద్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్–14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి బొల్లబోయిన జశ్వంత్, మాలావత్ శ్రీకాంత్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో వచ్చే నెల 2 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ఎంఈవో రాములు, ఉపాధ్యాయులు అభినందించారు.

వాహనాల తనిఖీ

మోపాల్: మండల కేంద్రంలో ఎస్సై యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలను ఉల్లంఘించిన 40 మంది వాహనదారులకు మొత్తం రూ.5వేల జరిమానా విధించారు. మరో రెండు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి.ఈ సందర్భంగా ఎస్సై యాదగిరిగౌడ్ మాట్లాడుతూ..మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు.ఆయన వెంట ఏఎస్సైలు దయాశ్‌సింగ్,రమేశ్‌బాబు,కానిస్టేబుళ్లు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మోపాల్: చందూర్ మండలకేంద్రంలోని శ్రీజగన్నాథ విద్యాలయంలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల(1994–95బ్యాచ్) ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం మండలంలోని నర్సింగ్‌పల్లిలో ఉన్న ఓ ప్రైవేట్ హాలులో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ పీవీ సుబ్బారావుతో పాటు ఉపాధ్యాయులు, 60 మంది వరకు పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. సుమారు 30 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో స్నేహితుల ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. పూర్వ విద్యార్థులు సత్యపాల్, శ్రీదేవి, శ్రీనివాస్, లక్ష్మీకాంత్ రెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

వాహనం ఢీకొని మహిళ ..



పల్లె సవిత మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నెహ్రూ పార్క్ వద్ద బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో పల్లె సవిత (52) మహిళ గాయాలపాలై చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సారంగాపూర్‌కు చెందిన పల్లె సవిత నెహ్రూ పార్క్ వద్ద రోడ్డు దాటుతుండగా అతివేగం, అజాగ్రత్తగా దూసుకొచ్చిన గూడ్స్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన సవితను స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పరిస్థితి విషమించి మున్సిపల్ కార్మికుడు ..

రామారెడ్డి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కామారెడ్డి మున్సిపల్ కార్మికుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన పసుపు రేవన్ కుమార్(25) కామారెడ్డి మున్సిపాలిటీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి డ్యూటీ ముగిసిన తరువాత ఇంటికి వెళ్తుండగా అతివేగంగా వెళ్తున్న ట్రాలీ ఆటో గ్రామ శివారులో బైకును ఢీకొట్టింది.ఈ ఘటనలో రేవన్‌కు గాయాలుకాగా, సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కామారెడ్డికి తరలించి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. మృతుడి తాత పసుపు బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి



రత్న (ఫైల్)

నిజామాబాద్ రూరల్: మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు మృతి చెందింది. గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జవాజీ రమేశ్ నాయనమ్మ రత్న(లచ్చమ్మ)కు 110 ఏళ్లు. మూడు తరాలను చూసి రత్న వృద్ధాప్య కారణాలతో కన్నుమూసింది. ఆమె అంత్యక్రియలకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

పేకాట స్థావరాలపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దారుగల్లీలో కొనసాగుతున్న పేకాటస్థావరంపై మంగళవారం రాత్రి దాడి చేసినట్లు ఎస్సై యాసిన్ అరాఫత్ బుధవారం తెలిపారు. పేకాట ఆడుతూ ఆరుగురు పట్టుబడ్డారని, వారి నుంచి రూ.17,838 నగదుతోపాటు ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.

ఆనంద్‌నగర్‌లో..

నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆనంద్‌నగర్‌లో పేకాట స్థావరంపై దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్సై గంగాధర్ బుధవారం తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.4వేల నగదుతోపాటు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పిప్రిలో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పిప్రి గ్రామంలో కొనసాగుతున్న పేకాట స్థావరంపై దాడిచేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి రూ.8450 నగదుతోపాటు ఐదు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మాక్లూర్: మండల కేంద్రంలోని రెహమత్‌నగర్‌లో సీసీఎస్ ఏసీపీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం దాడి చేసి 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యంతోపాటు నిల్వ చేసిన వ్యక్తులను మాక్లూర్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

ఇసుక టిప్పర్..



రుద్రూర్: పొతంగల్ శివారు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను ప్రత్యేక బృందం అధికారులు మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత పట్టుకుని కోటగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన పోలీస్, రెవెన్యూ బృందం పెట్రోలింగ్ చేస్తూ ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తోంది. మూడు రోజుల క్రితం పొతంగల్ మండలంలోని కొడిచర్ల శివారులో 50 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను గుర్తించి సీజ్ చేశారు. ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిన తరువాత ప్రతి రోజూ రాత్రి 9 నుంచి ఉదయం ఆరు గంటల వరకు మంజీరా పరీవాహక ప్రాంతంలో పర్యటిస్తూ ఇసుక అక్రమ రవాణకు అడ్డుకట్ట వేస్తోంది.

నగరంలో గంజాయి..

ఖలీల్‌వాడి: నగరంలోని చంద్రశేఖర్ కాలనీకి చెందిన ఓ యువకుడు గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. చంద్రశేఖర్ కాలనీకి చెందిన ఎండీ సాబేర్ గౌతంనగర్‌కు చెందిన అఫ్సర్ అనే యువకుడితో కలిసి ఉండగా, వారిని తనిఖీ చేశామన్నారు. ఎండీ సాబేర్ వద్ద 550 గ్రాముల గంజాయి లభించిన గంజాయితో పాటు బైక్‌ను సీజ్ చేశామన్నారు. ఎండీ అఫ్సర్ ఎలాంటి గంజాయి లభించలేదన్నారు. నిజామాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో దిలీప్‌కు అప్పగించామని, సాబేర్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్ కు తరలించినట్లు చెప్పారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

నిజామాబాద్ రూరల్: మద్యానికిబానిసైన యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రశేఖర్ కాలనీలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో ఎండీ ఆరిఫ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రశేఖర్ కాలనీకి చెందిన పాపి విష్ణు(20) గత కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి అతిగా మద్యం సేవించి తన తల్లితో గొడవ పడి ఇంటిపై నున్న చీరను మెడకు చుట్టుకొని కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

గొంతు కోసి భార్య హత్య

నిజాంసాగర్: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త కత్తితో ఆమె గొంతుకోసి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన దూప్‌సింగ్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని అవుసుల తండాలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మెగావత్ మోతీబాయి (53)పై అనుమానం పెంచుకున్న ఆమె భర్త షేర్యా గొడవ పడేవాడు. కుటుంబ కలహాలకుతోడు అనుమానం పెరగడంతో మోతీబాయిని షేర్యా గొంతుకోసి హతమార్చాడు. ఆ తరువాత బాన్సువాడ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. మృతురాలికి ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. హత్య విషయం తెలుసుకున్న బాన్సువాడ టౌన్ సీఐ అశోక్, నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

జల్సాల కోసం బైక్ చోరీలు



ఖలీల్‌వాడి: దుబాయ్ నుంచి వచ్చి జల్సాల కోసం బైక్ చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. మాక్లూర్ మండలం మామిడిపల్లిలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన కరిపె సుమన్(32) గతంలో దుబాయిలో పని చేసి తిరిగి వచ్చాడు. మద్యం, జల్సాలకు అలవాటుపడిన సుమన్ నిజామాబాద్, కోరుట్ల, నవీపేట్ మండలాల్లో తిరుగుతూ బైక్‌లు చోరీ చేశాడు. దొంగిలించిన బైక్‌లను విక్రయించేందుకు వెళ్తుండగా పోలీసులు బుధవారం పట్టుకుని విచారించారు. తాను ఐదు బైక్‌లు చోరీ చేసినట్లు ఒప్పుకోవడంతో అదుపులోకి తీసుకున్నారు. సుమన్‌ను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

ఎడపల్లి(బోధన్): మండలంలోని సాటాపూర్ గేట్ వద్ద రెండు వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి..

బుధవారం సాయంత్రం రెంజల్ మండలం దూపల్లికి చెందిన సురేశ్ తన భార్య, శిరీష, మూడేళ్ల కుమారుడు వైష్ణవ్‌తో కలిసి బోధన్‌కు వెళ్తున్నాడు. సాటాపూర్ గేట్ వద్ద వడ్డేపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు రాంగ్ రూట్‌లో వచ్చి సురేశ్ బైక్‌ను ఢీకొట్టి అక్కడి నుంచి పరారయ్యారు. గాయాలపాలైన సురేశ్‌తోపాటు అతడి భార్య శిరీషను స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు.

బాలిక అదృశ్యం



కామారెడ్డి క్రైం: రైల్వే స్టేషన్ నుంచి బాలిక అదృశ్యమైన ఘటన కామారెడ్డిలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా అప్పారావుపేట గ్రామానికి చెందిన సిరిగోలె ఎర్రన్న అనే వ్యక్తి కొద్దిరోజులుగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. సోమవారం తన అన్న కూతురైన మహి (7)ని వెంట తీసుకుని కామారెడ్డికి వచ్చాడు. పనులు ముగిసిన తరువాత హైదరాబాద్‌కు తిరిగి వెళ్లేందుకు రాత్రి 9 గంటల ప్రాంతంలో రైల్వే స్టేషన్‌కు వచ్చారు. రైలు లేకపోవడంతో టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద ఇద్దరూ కలిసి పడుకున్నారు. మంగళవారం ఉదయం లేచి చూసేసరికి మహి కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ళలో వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో ఎర్రన్న బుధవారం నిజామాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. చిన్నారి ఆచూకీ తెలిసిన వారు 87126 58591 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.